క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన డీసీసీబీ చైర్మన్



భీమవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న పీవీఎల్

సాక్షి, భీమవరం: భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను సోమవారం క్యాంపు కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నర్సింహరాజు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు రాజకీయా అంశాలపై చర్చించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా



ఎస్టీఓ పుష్పలతను సత్కరించిన దృశ్యం

ఆకివీడు: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై తక్షణమే స్పందిస్తానని ఆకివీడు ఉప ఖజానా అధికారిణి గుడి పుష్పలత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆకివీడు, ఉండి శాఖ సంఘం నేతలు నూతన సంవత్సర సందర్భంగా సోమవారం ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం పుష్పలత, సీనియర్ అసిస్టెంట్ సుందర్‌పాల్‌ను సత్కరించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు రమణమూర్తి, అధ్యక్షుడు జోజ్‌బాబు, ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు, సుబ్బారావు హరిబాబు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



తుందుర్రులో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సర్పంచ్ ఆరేటి సత్య వెంకట వీరాస్వామినాయుడు (పెద్దబ్బు) అన్నారు. తుందుర్రులో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. సభలో గ్రామంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సహకారంతో గ్రామంలో సచివాలయం, సీసీ రోడ్లు, డ్రైనేజీ, దేవర కోడు డ్రెయిన్ పూడిక తొలగింపు, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. గ్రామంలో సమస్యలను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగానే స్పందించి వెంటనే పరిష్కరిస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దా పాలురాజు, కార్యదర్శి మంగతయారు, పాలకవర్గ సభ్యులు, ఆశా వర్కర్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. మండలంలోని ఇతర గ్రామాలలో కూడా సోమవారం గ్రామ సభలు నిర్వహించారు.

పెన్షన్ సొమ్ము పంపిణీ



21వ వార్డు సచివాలయంలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని 21వ వార్డు ఎడ్వర్డ్ ట్యాంక్ సచివాలయంలో సోమవారం పెన్షన్ పంపిణీ నిర్వహించారు. కన్వీనర్లు జంగం సారమ్మ, పులపర్తి సాయి, షేక్ బాబి, ఎస్‌కే బాషా, మాజీ కౌన్సిలర్ జంగ మాణిక్యాలరావు మాట్లాడుతూ పేదల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పట్టణంలోని అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తున్నారని అన్నారు. పెంచిన పెన్షన్ రూ.2,750 నగదును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సరిపల్లి పండు, జంగం ప్రకాష్ కుమార్, నేతల నాని, హజార్ సత్యనారాయణ, పులపర్తి అనంత సత్య నాగమణి పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

సాక్షి, భీమవరం: భీమవరం డివిజన్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్ర రాజు మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఎమ్మిగ్నూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వీఆర్ఏ, వీఆర్వోలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కెనడి, వైవీ మంగరాజు, మండలం సెక్రటరీ జి జక్కరయ్య, గౌరీ శంకర్, రాజమణి, ముత్యాలరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నయనానందం.. ఉత్తర ద్వార దర్శనం

హరి నామస్మరణతో మార్మోగిన వైష్ణవాలయాలు

కాళ్ల: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం వైష్ణవాలయాలు ఆధ్యాత్మిక చింతన, భక్తి పారవశ్యంతో నిండిపోయాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం తరలివచ్చిన భక్తజనం హరినామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభూః శ్రీ వెంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు తెల్లవారుజామున నుంచే భక్తులు క్యూకట్టారు. కృష్ణా, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు ప్రముఖులు ఆలయానికి విచ్చేశారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు, కైకలూరు ఎమ్మెల్యే దులం నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రామరాజు, మాజీ ఎమ్మెల్యే శివరామరాజు, గోకరాజు నరసింహరాజు, గ్రామ సర్పంచ్ సాధు శ్రీదేవి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర ద్వారం, ధ్వజస్తంభం, మండపం, ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేక అలంకరణ చేసారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ఈఓ చాగంటి సురేష్ నాయుడు, ధర్మకర్తలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



హౌసింగ్ బోర్డు కాలనీలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



మారుతీ టాకీస్ వద్ద ప్రత్యేక అలంకరణలో దాసాంజనేయస్వామి



కాళ్లకూరు వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

వైభవంగా ముక్కోటి ఏకాదశి

భీమవరం(ప్రకాశం చౌక్): ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారిని భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ అధ్యక్షులు కంతేటి వెంకట్రాజు, కార్యదర్శి కుక్కల బాల, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఆలయంలో శాశ్వత నిత్యపూజ పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే కలెక్టర్ ప్రశాంతి తండ్రి చిట్టిబాబు స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆయన చేతుల మీదగా దాతలకు రశీదులు అందించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, మానేపల్లి నాగన్నబాబు, తోట భోగయ్య, వేండ్ర విజయదుర్గ, కానుబోయిన వెంకటరమణ, చెల్లబోయిన సూర్య ప్రకాష్ పాల్గొన్నారు. జేపీ రోడ్డులోని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రుద్రరాజు గంగాశ్రీదేవి, ధార్మిక పరిషత్ సభ్యులు, ఆలయ చైర్మన్ మంతెన రామ్‌కుమార్‌రాజు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు వాడపల్లి నారాయణచార్యులు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు. మారుతీ టాకీస్ సెంటర్‌లో వేంచేసియున్న శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక తమలపాకుల అలంకరణ చేశారు.

ముక్తి మార్గం.. వైకుంఠ ద్వారం



చినకాపవరంలో దర్శనమిచ్చిన స్వామివారు

ఆకివీడు: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని వైష్ణవ ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. ఉత్తర ద్వార దర్శనంతో భక్తులు తన్మయత్వం చెందారు. మాదివాడలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు దర్శించుకున్నారు. వారు మాట్లాడుతూ ఉత్తర ద్వారంలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ద్వారా పాపాలు హరించి ముక్తికి మార్గం లభిస్తుందన్నారు. దేవస్థానం చైర్మన్ మోటిపల్లి రాజు, మాదివాడ మల్లేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ గునుకుల కొండయ్య, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్ పుప్పాల పండు, పడాల శ్రీనివాసరెడ్డి, మోటుపల్లి గంగాధరరావు, వానపల్లి బాబురావు, వాడపల్లి జగన్, కౌన్సిలర్లు మోటుపల్లి కుమారి, నిమ్మల నాగు, మాధవి, గేదల అప్పారావు పాల్గొన్నారు.



కాళ్లకూరు వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్న కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



కాళ్లకూరులో ఉత్తరద్వారం ద్వారా దర్శనమిస్తున్న శ్రీవెంకటేశ్వర స్వామి వారు



కాళ్లకూరులో ఆలయంలో స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



కాళ్లకూరు వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకుంటున్న క్షత్రియ కార్పోరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు

వైభవంగా ముక్కోటి ఏకాదశి పూజలు





రామాయణపురంలో ప్రత్యేక అలంకరణలో దాసాంజనేయస్వామి, ఉండిలో ఉత్తర ద్వారం నుంచి వెంకన్నను దర్శనం చేసుకుంటున్న భక్తులు

భీమవరం అర్బన్: రామాయణపురంలోని దాసాంజనేయస్వామి ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు స్వామివారికి సహస్రనామార్చన, పంచామృత అభిషేకం, గోక్షీరాభిషేకాల పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక గీతాలను ఆలపించారు.

ఉండిలో..

ఉండి: మండలంలోని వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వారం నుంచి స్వామివార్లను భక్తులు దర్శించుకున్నారు. ఉండిలోని అలివేలు మంగతాయారు సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర్చక స్వాములు రొంపిచర్ల వెంకటకృష్ణమాచార్యులు, రొంపిచర్ల శ్రీరామకృష్ణమాచార్యులు, రొంపిచర్ల సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష నివేదన, సహస్ర నామార్చనలు, ఉత్తర ద్వార దర్శన ప్రత్యేక పూజలు చేశారు.

పీవీఎల్ చొరవతో పింఛను మంజూరు



'గడపగడపకు'లో పీవీఎల్‌కు వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగురాలు సిరి

ఆకివీడు: డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చొరవతో ఓ దివ్యాంగురాలికి ఎట్టకేలకు పింఛను మంజూరు కావడంతో ఆమె ఆనందానికి అవధులు లేవు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చినమిల్లిపాడుకు చెందిన చిగురుపాటి సిరి పింఛను కోసం గతంలో ఎన్నోసార్లు అధికారులకు, నాయకులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోయింది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇటీవల చినమిల్లిపాడు గ్రామానికి వచ్చిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు సిరి తన సమస్యను మొరపెట్టుకుంది. దీంతో పీవీఎల్ వెంటనే స్పందించి సంబంధిత అధికారితో ఫోన్‌లో మాట్లాడి సిరి అర్హతను పరిశీలించి సదరన్ సరిఫికెట్‌ను జారీ చేయాలని సూచించారు. ఈ క్రమంలో నెల రోజుల్లోనే ఆమెకు దివ్యాంగుల పింఛను మంజూరైంది. ఆదివారం పింఛను సొమ్ము రూ.మూడు వేలు తీసుకున్న సందర్భంగా సీఎం వైఎస్ జగన్, పీవీఎల్, సర్పంచ్ సీత బాలాజీకి కృతజ్ఞతలు తెలిపింది. అంతేకాక తనకు ట్రైసైకిల్ ఉచితంగా అందజేసిన కనుమూరి ఆనందవర్మకు ధన్యవాదాలు తెలిపింది.

ఫార్వర్డ్ బ్లాక్ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుందరరామరాజు

సాక్షి, భీమవరం: సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) రాష్ట్ర కార్యదర్శి పీవీ సుందరరామరాజు పిలుపునిచ్చారు. భీమవరంలో సోమవారం నిర్వహించిన ఏఐఎఫ్‌బీ జిల్లా ద్వితీయ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో సహజ వనరుల సమీకరణ, జాతీయకరణ, అంతరాలు లేని సమాజం కోసం పార్టీ శ్రేణులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. మతోన్మాదానికి, ప్రాంతీయ తత్వానికి వ్యతిరేకంగా పార్టీ సరికొత్త పంథాలో పయనిస్తుందని, ప్రజల కోసం వీధి పోరాటాలకు సైతం సిద్ధంగా ఉండాలని సుందరామరాజు అన్నారు. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలకు పోటీ చేశామని, వచ్చే ఎన్నికల్లో ఇంకా ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని పార్టీ నిర్ణయించిందన్నారు. మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సిద్ధాంతాలకు భంగం కలగకుండా అవసరమైతే వామపక్షాలతో కలిసి ఎన్నికల్లో భాగం పంచుకుందామన్నారు. ఈనెల 25, 26 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్ర ద్వితీయ మహాసభలు, ఫిబ్రవరి 23 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించే 19వ జాతీయ మహాసభలు విజయవంతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక కృష్ణమూర్తి మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేతుల మీదుగా ఆవిర్భవించిన పార్టీ ప్రజల పక్షాన అలుపెరుగని ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ఏఐఎఫ్‌బీ సమావేశాల్లో పార్టీ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా కనుమూరి వెంకటపతిరాజు, ప్రధాన కార్యదర్శిగా లంక కృష్ణమూర్తి, కార్యవర్గసభ్యులు బొడ్డు వెంకటేశ్వరరావు, నడింపల్లి హరినాథరాజు, వాటాల రాంబాబు, మోకా పరమేశ్వరరావు ఎన్నికయ్యారు. అలాగే నర్సాపురం డివిజన్ కార్యదర్శిగా పెచ్చెట్టి లక్ష్మణరావు, భీమవరం డివిజన్ కార్యదర్శిగా దండు శ్రీనివాసరాజు, తాడేపల్లిగూడెం డివిజన్ కార్యదర్శిగా ఎస్.నాగవెంకట సత్యనారాయణ ఎన్నికయ్యారు.

జూదరుల అరెస్టు

భీమవరం అర్బన్: తాడేరులో సోమవారం పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై వి.అప్పలరాజు చెప్పారు. వారి నుంచి రూ.1100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చంద్రబాబుపై హత్య కేసు నమోదు చేయాలి



బడుగు బాలాజీ,వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి

ఉండి: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ప్రచార పిచ్చికి అమాయకులు బలి అవుతున్న ఘటనలను సుమోటోగా తీసుకుని హత్య కేసులుగా నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రచార పిచ్చితో సభలు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్న చంద్రబాబు కనీసం రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడిగా కూడా పనికిరాడన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని టీడీపీ గుర్తింపు రద్దు చేయాలని, దీనిపై వెంటనే స్పందించాలని కోరారు. టీడీపీ సభలకు జనం రావడం లేదని గుర్తించిన చంద్రబాబు చంద్రన్న కానుకలు అంటూ ప్రజలను మళ్లీ మోసం చేసే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఆయన ప్రచార యావకు గతంలో, ఇప్పుడు కూడా ప్రజలే బలవుతున్నారన్నారు. ప్రజల ప్రాణాలంటే లెక్కలేకుండా ప్రవర్తిస్తున్న చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం మళ్లీ చెబుతారని అన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారన్నారు. చంద్రబాబు కలలు కనడం మానుకుని ప్రజలంతా ఇదేమి ఖర్మరాబాబు అంటూ తలలు పట్టుకుంటున్నారని విమర్శించారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



చెరుకువాడ సచివాలయంలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామంలో కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెరుకువాడ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు హెచ్చరించారు. సంక్రాంతి పండగ రోజుల్లో జూదం నిరోధించేందుకు సోమవారం గ్రామ సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించి తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ హైకోర్టు, జిల్లా కలెక్టర్, రెవెన్యూ, పోలీస్ వారి ఉత్తర్వులను అనుసరించి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కఠిన చర్యలకు పూనుకుంటున్నట్లు తెలిపారు. సంక్రాంతి పర్వదినాల్లో సంప్రదాయమైన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రజలు మొగ్గు చూపాలన్నారు. కోడిపందేలు, జూదం గ్రామంలో నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు పంచాయతీ తరపున చర్యలుంటాయన్నారు. అలాగే గ్రామాభివృద్ధిపై ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కే.గోపాలకృష్ణ, వీఆర్వో ఎస్.చిన్నారావు, సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి పెన్షన్ కానుక వారోత్సవాలు



పెన్షన్ కానుక వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాలను మంగళవారం నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నామని కలెక్టర్ పె.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం పెన్షన్ కానుక పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెన్షన్ కానుకకు సంబంధించి అభ్యంతరాలు వచ్చాయని, వీటిలో 90 శాతం పరిశీలన పూర్తికాగా మిగిలిన వాటిని పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం వారికి పెన్షన్ మంజూరు చేసినా, లేదా తిరస్కరించినా సంబంధిత రికార్డులు కార్యాలయంలో పక్కాగా అందుబాటులో ఉంచాలన్నారు. రికార్డులు లేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారోత్సవాల్లో భాగంగా కొత్తగా మంజూరు చేసిన పెన్షన్‌దారులకు పెన్షన్లు అందిస్తామన్నారు.

ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరి

ప్రభుత్వ ఉద్యోగులు ఫేషియల్ అటెండెన్స్‌ను ఈనెల 1వ తేదీ నుంచి అమలులోకి తీసుకువచ్చామని, సిబ్బంది విధిగా హాజరు వేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉద్యోగాల్లో మరింత బాధ్యత పెంచేందుకు ఫేషియల్ అటెండెన్స్‌ను ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందని, ఉద్యోగులు విధిగా అటెండెన్స్‌ను వేయాలన్నారు.

7 నుంచి 'జగనన్నకు చెబుదాం'

ఈనెల 7వ తేదీ నుంచి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం అమల్లోకి రానుందని, వివిధ సేవలకు చేసుకున్న దరఖాస్తులు రీఓపెన్ అయితే లబ్ధిదారులతో సీఎం జగన్ నేరుగా మాట్లాడతారని, అభ్యంతరాలు ఉంటే వాటిపై జిల్లా అధికారులకు సమాచారం అందుతుందని వారు విధిగా తనిఖీలు నిర్వహించి నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. జేసీ జేవీ మురళీ, డీఆర్వో దాసి రాజు, డీపీఓ ఎం.నాగలత, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

సాక్షి, భీమవరం: అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్త, మరో ఇద్దరు కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని భీమవరం టూటౌన్ ఆదర్శనగర్‌కు చెందిన డి.తేజస్విని సోమవారం ఫిర్యాదు చేసిందని పోలీసులు చెప్పారు. 2000 సంవత్సరంలో తనకు వివాహమైందని, కొంతకాలం కాపురం సజావుగా సాగినా ఇటీవల అదనంగా కట్నం కావాలంటూ వేధింపులకు గురిచేస్తున్నారని తేజస్విని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ఎస్సై వి.రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

